క్లుప్తంగా

చెస్‌లో మణితేజకు ఆలిండియా ఫిడే రేటింగ్



వరంగల్ స్పోర్ట్స్: మే నెలలో 6, 7, 8వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆలిండియా చెస్ 1800 ఫిడే రేటింగ్‌లో హనుమకొండలోని ఎన్జీఓఎస్ కాలనీకి చెందిన కోల మణితేజ ఫిడే రేటింగ్ సాధించాడు. 9రౌండ్లకు 5 గేమ్‌లు విజయం సాధించి 1504 పాయింట్లను మణితేజ సాధించి రేటింగ్ పొందాడని కోచ్ గాదె రాంప్రసాద్ వివరించారు. ఏడవ తరగతి చదువుతున్న మణితేజ రాంనగర్‌లోని కమల్‌కింగ్స్ చెస్ అకాడమీలో కోచ్ రాంప్రసాద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు.

రేపు పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని ఈనెల 3వ తేదీన వరంగల్ మట్టెవాడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెయింటింగ్, డ్రాయింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'మన నేల – మన భవిష్యత్, భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు నివారణ' అనే అంశంపై పోటీలు ఉంటాయని ఆమె తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 5వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో జరగనున్న కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఖాళీ స్థలం కబ్జా



వరంగల్: ఎస్సార్‌నగర్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్లల్లో లబ్ధి పొందినవారు కాలనీలోని ఖాళీ స్థలాలను ఆక్రమిస్తూ ఇళ్లు నిర్మిస్తున్నారని బీజేపీ 14వ డివిజన్ అధ్యక్షుడు కొత్తకొండ రాజు అన్నారు. ఈ సందర్భంగా రాజు శనివారం మాట్లాడుతూ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌కు సొంత భవనం లేనందున అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని నిర్మించాలని కాలనీ వాసులు తీర్మానం చేశారని తెలిపారు.

డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేందర్



హన్మకొండ / హసన్‌పర్తి: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు చెందిన చుంచు రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీబీఎఫ్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాజేందర్ గతంలో డీబీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, భూమి, ఉపాధి హక్కుల రాష్ట్ర కన్వీనర్‌గా, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. కాగా, తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన డీబీఎఫ్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు వినయ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి భాగ్యరావు, జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్‌యూ జిల్లా కన్వీనర్‌గా ఠాగూర్‌నాథ్



హన్మకొండ చౌరస్తా: ధర్మ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) హనుమకొండ జిల్లా కన్వీనర్‌గా వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన బరుపట్ల ఠాగూర్‌నాథ్ నియమితులయ్యారు. మే 31వ తేదీన ఉస్మానియ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగిన డీఎస్‌యూ రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కన్వీనర్‌గా ఠాగూర్‌నాథ్‌ను రాష్ట్ర కన్వీనర్ మేడి కార్తీక్ ప్రకటించారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ఆదర్శ లా కళాశాలలో న్యాయవిద్యను అభ్యసిస్తున్న ఠాగూర్‌నాథ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ పూరెల్ల విష్ణుకు ధన్యవాదాలు తెలిపారు.

డివిజన్‌లో పడకేసిన పనులు



చెరువులో వ్యర్థాలు, గుర్రపు డెక్క

వరంగల్: 13వ డివిజన్‌లోని అసంపూర్తి పనులను పూర్తి చేయాలని, మెయిన్‌రోడ్డుతో పాటు గల్లీల్లో పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక కార్పొరేటర్ సురేష్‌జోషి ఆరోపించారు. వర్షాకాలానికి ముందుగానే బాక్స్‌డ్రెయిన్లలోని వ్యర్థాలను తొలగించి పూడికలు తీయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా కింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. పాడైన బోర్లకు మరమ్మతులు చేయాలని విన్నవిస్తే సంబంధిత సామగ్రి లేదని దాటవేస్తున్నారని తెలిపారు. చిన్నవడ్డేపల్లి చెరువు కట్ట కింద ఉన్న 40ఫీట్ల రోడ్డులో కొందరు అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని అధికారులకు దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ఖిలా వరంగల్: రామాలయంలో కలశ పూజలో హనుమాన్ మాలధారులు, భక్తులు



వేయి స్తంభాల దేవాలయంలో ఆంజనేయుడికి పూజలు నిర్వహిస్తున్న గంగు ఉపేంద్రశర్మ



న్యూశాయంపేటలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హనుమాన్ జయంతి వేడుకలను నగర వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా కలశ, తమలపాకులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కాపువాడలోని ఆంజనేయుడి సన్నిధిలో..



రామన్నపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



కాశిబుగ్గ: పూజలో పాల్గొన్న కాలనీ వాసులు



20వ డివిజన్ రంగనాథస్వామి దేవాలయంలో..



విశ్వనాథ కాలనీలోని ఆంజనేయ ఆలయంలో..



మడికొండ బురుజు వద్ద..



శివనగర్‌లో..



వరద దత్తక్షేత్రంలో..



కాశిబుగ్గ: వివేకానంద కాలనీలో అన్నదానం

కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తే ఊరుకోం



నాయకులకు అడ్డుకుంటున్న పోలీసులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తే ఊరుకోబోమని కాకతీయ యూనివర్సిటీ బీఆర్‌ఎస్వీ నాయకులు తేల్చిచెప్పారు. ఈమేరకు కేయూ మొదటి గేట్‌వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేయడానికి యత్నించారు. దాంతో ఆ సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య తోపులాట జరిగింది. కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర మాట్లాడుతూ తెలంగాణ రాజముద్రలో కాకతీయ కళాతోరణం తొలగించడం అంటే రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని వాపోయారు. ఈ ప్రాంత శిల్పకళా వైభవానికి, సంప్రదాయాలు, ప్రజారంజక పాలనకు నిలువెత్తు నిదర్శనం కాకతీయ కళాతోరణం అని అన్నారు. చరిత్ర తెలియకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేసీఆర్ మీద ఉన్న ద్వేశంతో ఆయన ఆనవాళ్లు లేకుండా చేయాలనేది చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి సంగని సూర్యకిరణ్, అర్బన్, రూరల్ కోఆర్డినేటర్లు రాకేష్‌యాదవ్, నాగరాజు, రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీరస్వామి, అర్షం మధు, అనిల్, కల్యాణ్, చిర్ర ప్రకాశ్, రాకేష్, సేహిత్, ముజాయితిన్ పాల్గొన్నారు.

పాల నాణ్యతపై అవగాహన అవసరం



నాణ్యత ప్రమాణాలను వివరిస్తున్న బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: పౌష్టికాహారమైన పాల నాణ్యతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల సంఘాల బాధ్యులు సూచించారు. అంతర్జాతీయ పాల దినోత్సవం సందర్భంగా ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సహకారంతో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా 16 రకాల పాల నాణ్యత పరీక్షలను మొబైల్ వ్యాన్ అనలిస్ట్ నిర్వహించారు. హనుమకొండలోని విజయ డెయిరీ ఆవరణలో వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ పాల ప్యాకెట్‌ను పోలి మరో రెండు ప్రైవేట్ డెయిరీలు వ్యాపారం చేస్తున్నాయని, తద్వారా విజయ డెయిరీ నష్టపోవడమే కాగా, ప్రజలు మోసపోవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు నేడు చేసిన నాణ్యత పరీక్షలతో తేలిన అంశాలను అధికారులకు అందజేయనున్నట్లు వివరించారు. వినియోగదారుల మండలి జాతీయ కార్యదర్శి చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు దామోదర్, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, విజయ డెయిరీ వరంగల్ డీడీ ప్రదీప్, హైదరాబాద్ డెయిరీ అధికారి రాజ్‌కుమార్, మొబైల్ ల్యాబ్ అనలిస్ట్ రాజేష్, వినియోగదారుల మండలి కార్యదర్శులు రంజిత్, రాజేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుంది



శిక్షణ శిబిరానికి హాజరైన ఎన్‌సీసీ కేడెట్లు

మామునూరు: ఎన్‌సీసీ శిక్షణతో కేడెట్లలో క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ వరంగల్ 8వ బెటాలియన్ క్యాంప్ కమాండెంట్ రవిందర్ కుమార్ అన్నారు. వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో ఎన్‌సీసీ వరంగల్ 8వ బాలికల బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ రేవంత్ ప్రభాకరన్ ఆధ్వర్యంలో 1 నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి 516 మంది బాలికలు, బాలురు శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హాజరై ఎన్‌సీసీ శిక్షణ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌సీసీ కేడెట్లకు మంచి భవిష్యత్ ఉంటుందని, ఉద్యోగ సాధించేందుకు బీ, సీ సర్టిఫికెట్లు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో కె.రమన్‌రావు, సుజితదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా శిక్షణ శిబిరం



కాశిబుగ్గ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ ఆదేశాలతో మే 1 నుంచి జరిగిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం శని వారం ఓసిటీ మైదానంలో ముగిసింది. ఈ సందర్భంగా వరంగల్ డీవైఎస్ఓ సత్యవాణి మాట్లాడుతూ నగరంలో 200 మంది, గ్రామీణ ప్రాంతాల్లోని శిబిరాల్లో 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. స్టాండర్డ్ హైస్కూల్ కరస్పాండెంట్ కృష్ణాకర్, పీఈటీల సంఘం గౌరవ అధ్యక్షుడు రఘువీర్, డీఎస్‌ఏ కోచ్‌లు సుమన్, లింగమూర్తి, కుమారస్వామి, సిబ్బంది మౌనిక, రాజేందర్, అహ్మద్ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్‌కు అండగా ఉంటా: నాయిని



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, జర్నలిస్టులు

నయీంనగర్: తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి పదవున్నా లేకున్నా జర్నలిస్టులతో స్నేహపూర్వకంగా ఉన్నానని, ప్రెస్ క్లబ్‌కు ఎల్లవేళలా అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్ –2024 పోస్టర్‌ను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజుతో కలిసి రాజేందర్‌రెడ్డి హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, నిత్యం ఉరుకులు, పరుగులతో వార్తల సేకరణలో ఉండే జర్నలిస్టులకు క్రీడలు ఆటవిడుపు లాంటిదన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో అధికారుల తనిఖీలు



షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

మడికొండ: మడికొండలోని విత్తనాలు, ఎరువుల షాపులను మండల రెవెన్యూ అధికారి బావుసింగ్, మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పలు రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. షాపులో ఉన్న స్టాక్‌ను ఎప్పటికప్పుడు రికార్డులో పొందుపర్చాలని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని సూచించారు. గ్రామంలోని అశ్విని ఫర్టిలైజర్, వెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీలక్ష్మి శ్రీనివాస్ సీడ్స్ షాపులను తనిఖీ చేసి తగు సూచనలను చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఎస్సైలు రాజబాబు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ పూర్వ విద్యార్థికి సన్మానం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి పెండ్యాల సురేష్‌ను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, కేడీసీ అల్యూమ్ని అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీఎస్ చారి, కోశాధికారి డాక్టర్ వినోద్‌రావు శనివారం సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పింగిళి కళాశాలలో అతిథి అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో సురేష్ డాక్టరేట్ సాధించారని రాజారెడ్డి తెలిపారు.

అందరికి ఆరాధ్యుడు.. ఆంజనేయుడు



మాట్లాడుతున్న మహేశ్వర శర్మ

హన్మకొండ కల్చరల్: ఆంజనేయస్వామి అందరికి ఆరాధ్యుడని ప్రవచకుడు, ఆధ్యాత్మికవేత్త గారెపల్లి మహేశ్వరశర్మ అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా పరశురామ్ దళ్ ఆధ్వర్యంలో తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన పురస్కరించుకుని సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మహేశ్వరశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆంజనేయుడి అవతారాలు, పురాణ గాథలను వివరించారు. అనంతరం 108 మంది భక్తులతో 111 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పరశురామ్ దళ్ ఆధ్వర్యంలో చైతన్య శోభాయాత్రను నిర్వహించారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

హన్మకొండ కల్చరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రుద్రేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ సుప్రభాత పూజ, ఉత్తిష్ట గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, మహాలింగార్చన నిర్వహించారు.

మూసివేసిన పాఠశాలలను తెరిపించాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించే విధంగా కార్యాచరణ చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి, జిల్లా అధ్యక్షుడు రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ వెంకటరెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేళ్లలో సుమారు 6వేల పాఠశాలలు మూతబడినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామపంచాయతీలో ఒక పాఠశాల ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ బాధ్యులు సారయ్య, కుమారస్వామి, బోడ చక్రునాయక్, పాలకుర్తి సదానందం పాల్గొన్నారు.

సీఎంకు పోస్టు కార్డులు



హన్మకొండ: ప్రభుత్వ లోగో నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించవద్దని కోరుతూ బీఆర్‌ఎస్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డులు రాశారు. హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పోస్టు కార్డులు రాసి హనుమకొండ పోస్టాఫీస్‌లో శనివారం పోస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లోగో నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించడాన్ని విరమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు నయీమొద్దీన్, ఇస్మాయిల్, తస్లీమ్, యాకూబ్, ఆరిఫ్, రఘు, ఇంతియాజ్, గౌస్ ఖాన్, ఆసిలిన్ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో జీలుగ విత్తనాల కొరత

- రైతుల పాట్లు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలో జీలుగ విత్తనాల కొరత ఏర్పడింది. దీంతో విత్తనాల కోసం రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇతర మండలాల నుంచి జీలుగ విత్తనాల ఖరీదు కోసం ప్రయత్నిస్తున్నారు. బాగా డిమాండ్ ఉండడంతో విత్తనాలు దొరకడం కష్టంగా మారింది. వర్షాలకు నెలరోజుల ముందే జీలుగ విత్తనాలు వేయాల్సి ఉంటుంది. ఈసారి వర్షాలు ముందుగా రావడంతో జీలుగ విత్తనాల కొరత ఏర్పడింది.

ఎదురుచూపులు

ఈ సీజన్‌లో హసన్‌పర్తి మండలానికి మూడువందల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు విడుదలయ్యాయి. వచ్చిన నాలుగు రోజుల్లోనే ఆ విత్తనాలను విక్రయించారు. విత్తనాలు ఖరీదు చేయని రైతులు ఎదురుచూస్తున్నారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

మరో 150 క్వింటాళ్ల జీలుగ కావాలి



జిల్లాలో తొలి విడతనే మండలానికి మూడు వందల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు విడుదలయ్యాయి. అదనంగా మరో 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాల కోసం లేఖ రాశా. వర్షాలు ముందుస్తు రావడంతో ఈ పరిస్థితి నెలకొంది.

– అనురాధ, వ్యవసాయాధికారి

ఏఐఎస్‌బీ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌బీ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద ఈనెల 25న జరగనున్న ఆల్‌ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) 74వ వార్షికోత్సవాల పోస్టర్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్, బాధ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ 1951లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఏఐఎస్‌బీ ఏర్పాటు అయిందని వివరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకు కుల, మత ప్రాంతాలకు అతీతంగా సోషలిజం సాధనకు దేశ పునర్‌నిర్మాణానికి దేశ వ్యాపితంగా ఉద్యమిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, అలాగే యూనివర్సిటీల పరిరక్షణకు ఏఐఎస్‌బీ అనేక పోరాటాలు చేస్తోందని తెలిపారు. విద్యరంగ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 25న ఏఐఎస్‌బీ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మోహన్, ప్రవీణ్, యూసిన్, అఖిల్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన డీసీసీబీ చైర్మన్ మార్నేని

హన్మకొండ: రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కలిశారు. హైదరాబాద్‌లోని వారి నివాస గృహాల్లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేసి రవీందర్ రావు ఘనంగా సన్మానించారు.

నిలిచిన ప్లాస్టిక్ వ్యర్థాలు



మడికొండ: 64వ డివిజన్ మడికొండ – ధర్మసాగర్ రోడ్డు పక్కన డ్రెయినేజీ నిర్మాణం కోసం తీసిన కాలువలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు చేరాయి. నీరు బయటకు వెళ్లాలని రెండేళ్ల క్రితం డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసి ఇంతవరకు నిర్మాణం మొదలు పెట్టలేదు. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలువ నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న పరిషత్ సభ్యులు

హన్మకొండ కల్చరల్: గోవుల అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి వరంగల్ మహానగర విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కాజీపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పుప్పాల తిరుమలరావును విశ్వహిందూ పరిషత్ సభ్యులు శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించి లారీ, ఆటోల్లోనే కాకుండా క్లోజ్డ్ కంటైనర్లలో అక్రమ గో రవాణా జరుగుతోందని, తక్షణమే చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోరక్ష ప్రముఖ్ నంగునూరు నాగరాజు, ఓం కుమార్, పుప్పాల రాజు, దుపెల్లి అరవింద్, గూడూరు రాకేష్ పాల్గొన్నారు.

అమరులకు కొవ్వొత్తులతో నివాళి



హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఉద్యమ అమరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు శనివారం చేరుకుని కొవ్వొత్తులు వెలిగించి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు మర్రి యాదవరెడ్డి, భీరవెల్లి భరత్‌కుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, బండి రజనీకుమార్, పులి రజనీకాంత్, జోరిక రమేష్, ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.